# చెప్పనా? తా'ళ్లా, తో'ళ్లా.

తాబేళ్ళంటే నాకు చిన్నప్పట్నుంచీ ఎంతో భయం. ఒక ముసలి రాత్రిపూట, రెణ్ణెల్లకిందట సత్యవతి కూర్మావతారంలాగ ముడుచుకొని మూలుగుతూ 'రావిచెట్టు, రావిచెట్టు' అని అరిచింది. నేను భూకంపంలా వణికిపోయేను. రావిచెట్టుఅంటే సత్యవతికి సింహస్వప్నం. రావిచెట్టంటే నాకు తాబేళ్ళు జ్ఞాపకం వస్తాయి. ఎందుకో చెప్పనా? పోనీ, తరవాత చెప్తాను.

పువ్వులమ్మిన వూళ్లో కట్టెలమ్మలేం అనుకుంటాం గానీ, నేను నా ఆత్మనే అమ్ముకున్నాను. నీకు తెలుసుగా నేనూ సత్యవతీ మద్రాసులో ఎలా కాపురం పెట్టేమో! ఈ మద్రాసులో మనుష్యులుకాదు నివసిస్తున్నది; గెద్దలు, రాబందులు, తోడేళ్ళు—అదీ అసలైన నిర్వచనం—మద్రాసు నిండా తోడేళ్ళు తోడేళ్ళు, తోడేళ్ళంటే నాకు అమితమైన అసయ్యం, ఎందుకో భయం. మొన్న రాత్రికాలం చీకటి మంటలతో కాలిపోతున్నట్టనిపించింది. సత్యవతికి నూటనాలుగు డిగ్రీల జ్వరం. నాకు ఆ జ్వరమంత ఆకలి. పైన చీకట్ల కుంభవర్షం. ఇద్దరం ముడుచుకుని పడుకొన్నాం. సత్యవతి కొన-గొంతుతో 'తోడేళ్ళు తోడేళ్ళు' అని అరిచింది. నేను దీపకళికలా, తుపానుతో అడిసినవాడిలా వణికిపోయేను ఎందుకో చెప్పనా, పోనీలే రేపు చెప్తా.

వెంకట్రావు నన్ను తన కంపెనీలోంచి తగిలేశాడా. ఇక్కడా అక్కడా ఉద్యోగానికి ప్రయత్నించి చివరికి బస్సు కండక్టరుగా కుదుర్చుకొన్నాను. నాకు సంతృప్తికరంగానే ఉండేది. గానీ స్నేహితుల మొఖాలు? వెంకట్రావుకూడా ఒకసారి బస్సు ఎక్కాడు. 'ఎంగే సార్' అన్నాను. బిక్క చచ్చిపోయాడు. 'ఒక పారిస్' అన్నాడు. టిక్కట్టు చింపి ఇచ్చేను. 'కాలేజీ చదువు చదివిన నువ్వు ఇంత నీచమైన ఉద్యోగానికి కుదురుకుంటా వనుకోలేదురా' అన్నాడు. 'రెండు లక్షల ఆస్తివున్న నువ్వు కారు ఎక్కడం మానేసి బస్సులో ప్రయాణం చేస్తా వనుకోలేదురా' అన్నాను. 'తరవాత ఇంటికి రా' అన్నాడు. 'నువ్వే రా మాయింటి' కన్నాను. వచ్చేడు 'ఏమిట్రా ఇంత హీనమైన ఉద్యోగానికి' అన్నాడు. 'నీదగ్గర మళ్ళా ఉద్యోగానికి వస్తా ననుకున్నావా?– ఏం ఇప్పుడు నా కొచ్చిన లోటేమిటి– జీతంమానాన జీతం; నా వ్యసనాలకు సరిపడంత పైన దొరుకుతుంది' దులిపేశాశాను, తిట్టేను. 'మీ వంశానికి అపకీర్తిరా' అన్నాడు తోడేలు. తరవాత ఏమైందో చెప్పనా? పోనీ రేపు చెప్తాను.

తాబేళ్ళంటే నాకు చిన్నప్పట్నుంచీ హడలు. ఎందుకో చెప్పనా? నిన్న సత్యవతిని బూడిదచేసి వచ్చాను. వెంకట్రావుకూడా వచ్చేడు. సానుభూతి కురిపించాడు. నేను వాణ్ణి తిట్టలేకపోయాను. 'రావిచెట్టు రావిచెట్టు' అని అన్నాను, ఈ మాటలు సత్యవతి చితిలోంచి వచ్చినట్టు అన్పించింది. వెంకట్రావు మూర్ఛపోయినట్లు పాలి (?) పోయిన నిష్క్రమించాడు తోడేలు.

నీకు తెలుసా? పాతమాంబళంలో మాయింటి పెరట్లో రావిచెట్టూ నుయ్యీ ఉండేవి. ఆ నూతులోనే సత్యవతి- పోసిలే తరవాత చెప్తాను. తాబేళ్లూ తోడేళ్ళూ అంటే నాకు చెడ్డభయం. వాట్ని తప్పించుకొని బతకాలని ప్రయత్నిస్తున్నా. ఎలాగో చెప్పనా? పోసి రేపు చెప్తాను.

గాని ఒక్క సంగతి నిన్నడగా లనుకొంటున్నా. ఈ పక్కనున్న చెరువులో తాబేళ్ళు లేవుకద?